క్లుప్తంగా

షిర్డీసాయి ఆలయంలో ప్రత్యేక పూజలు


పూజలందుకున్న సాయిబాబా

డోన్: పట్టణ శివారులోని షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం విశేష పూజలు నిర్వహించారు. వేకువజామున అభిషేకాలు, అర్చనలు, హారతి, నైవేద్య సమర్పణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం ప్రత్యేక అలంకరణ, హారతి నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు సీఎం శ్రీనివాసులు,కందుకూరి పార్థసారథి,కొండా సురేష్, మల్లికార్జునరెడ్డి, శ్రీరాములు పాల్గొన్నారు.

శ్రీశైలానికి తరలివెళ్లిన శివస్వాములు


ఇరుముడులతో శివస్వాములు

కొలిమిగుండ్ల: మండలంలోని అంకిరెడ్డిపల్లెకు చెందిన 55 మంది శివమాల స్వీకరించిన స్వాములు గురువారం శ్రీశైలం మల్లికార్జున స్వామి దర్శనార్థం బయలుదేరి వెళ్లారు. ముందుగా గీతాశ్రమంలో ప్రత్యేక పూజలు చేసి ఇరుముడులు స్వీకరించారు. కుటుంబ సభ్యులు, బంధువులతో ఆశ్రమం కోలాహలంగా మారింది. గ్రామంలోని ప్రధాన వీధి మీదుగా శివనామస్మరణ చేస్తూ సబ్‌స్టేషన్ సమీపంలోని పొలిమేర వరకు నడుచుకుంటూ వచ్చి అక్కడి నుంచి వాహనాల్లో శ్రీశైలం వెళ్లారు.

రేపటి నుంచి వెంకటరెడ్డి తిరునాల

ప్యాపిలి: పట్టణంలోని వెంకటరెడ్డి కాలనీలో వెలసిన అవధూత వెంకటరెడ్డి తరునాల ఈ నెల 22, 23 తేదీల్లో జరుగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 22న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం, 23న తేరు లాగే కార్యక్రమంతో వేడుకలు ముగుస్తాయని తెలిపారు. కాగా తిరునాల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో దుకాణాలు, జెయింట్ వీల్, బ్రేక్ డాన్స్ వెలియడంతో సందడి వాతావరణం నెలకొంది.

ఫార్మర్ రిజిస్ట్రీ ఉంటేనే ప్రభుత్వ ఫలాలు

కోవెలకుంట్ల: రైతులు పీఎం కిసాన్ సహా ప్రభుత్వ పథకాలు పొందాలంటే తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి నిరంజన్ అన్నారు. ఈ నెల 24వ తేదీ పీఎం కిసాన్ పథకం ద్వారా రైతులకు రూ. 2 వేల చొప్పున నగదు జమ అవుతుందన్నారు. రైతులు రైతు సేవా కేంద్రాలకు వెళ్లి ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని పేర్కొన్నారు.

27న కబడ్డీ పోటీలు

బేతంచెర్ల: యంబాయి గ్రామంలోని పార్వతి భోగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని ఈ నెల 27న అంతర్ రాష్ట్ర హోమ్ టీమ్స్ కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు, గ్రామస్తులు తెలిపారు. 26న నందికోళసేవ, 27న స్వామివారి కల్యాణోత్సవం, 28న ప్రత్యేక పూజలు, మార్చి 1న వసంతోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా కబడ్డీ పోటీల్లో గెలుపొందిన వారికి వరుసగా రూ.10 వేలు, రూ. 8వేలు, రూ.6 వేలు, రూ.4 వేల చొప్పున నగదు బహుమతులతోపాటు క్వార్టర్ ఫైనల్ నుంచి బెస్ట్ రైడర్, బెస్ట్ డిఫెండర్‌కు రూ. 2వేలు అందజేస్తామని వెల్లడించారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు 8897717172, 8074372584 నంబర్లను సంప్రదించాలన్నారు.

గొల్లపల్లి బుగ్గలో బండలాగుడు పోటీలు

ప్యాపిలి: గొల్లపల్లి బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 27న బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు పళ్లలోపు వృషభాలకు పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి ఉన్నవారు రూ.500 ప్రవేశ రుసుం చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. విజేతగా నిలిచిన వారికి రూ. 25,000 నగదు బహుమతి అందజేస్తామన్నారు. ఆ తర్వాత వరుసగా రూ. 20 వేలు, రూ.15 వేలు, రూ. 12 వేలు, రూ. 10 వేలు, రూ. 8 వేలు, రూ.7 వేలు చొప్పున నగదు బహుమతులు అందజేస్తామన్నారు. మొత్తం 12 బహుమతులు ఉంటాయని తెలిపారు. వివరాలకు 88973 44886, 99858 22980 నంబర్లను సంప్రదించాలన్నారు.

సులభరీతిలో విద్యాబోధన ఉండాలి

కోవెలకుంట్ల: పూర్వ ప్రాథమిక విద్య సులభరీతిలో ఉండాలని జోన్ డిప్యూటీ డీఈఓ వెంకట్రామిరెడ్డి సూచించారు. జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా స్థానిక ఉర్దూ ఉన్నత పాఠశాలలో మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆరు రోజుల శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. గురువారం శిక్షణా తరగతులను డిప్యూటీ డీఈఓ, సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ పరిశీలించారు. ఈ నెల 25వ తేదీ వరకు శిక్షణా తరగతులు జరుగుతాయన్నారు. నూతన విద్యా విధానం పిల్లల సమగ్రాభివృద్ధికి తోడ్పడుతుందన్నారు.

రుణం.. రాజకీయ గ్రహణం..!

- కార్పొరేషన్ రుణాలు అర్హులకు అందేనా?
- నేటి నుంచి దరఖాస్తుల పరిశీలన, ఎంపిక
- భారీగా వచ్చిన దరఖాస్తులు
- మంజూరులో కూటమి నేతల జోక్యం
- అభ్యర్థుల్లో సన్నగిల్లిన ఆశలు


బనగానపల్లెలో జరిగిన ఇంటర్వ్యూలకు భారీగా తరలివచ్చిన అభ్యర్థులు

కొలిమిగుండ్ల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్‌లు విడుదల అవుతాయని నిరుద్యోగ యువత ఎన్నో కలలు కన్నారు. ఎనిమిది నెలలు దాటినా ఏ ఒక్క నోటిఫికేషన్ లేకపోవడంతో నైరాశ్యంలో మునిగిపోయారు. పని చేసుకుందామంటే పరిశ్రమలు లేవు. చిన్న వ్యాపారాలు చేసుకుందామంటే ఆర్థిక స్థోమత అంతంత మాత్రంగానే ఉంది. ఈ క్రమంలో ప్రభుత్వం బీసీ, కాపు, ఈబీసీ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ యూనిట్లు మంజూరు అయ్యాయని తెలిసి ఎంతో సంతోషంతో పెద్ద ఎత్తున దరఖాస్తులు చేసుకున్నారు. అయితే సబ్సిడీ రుణాలు అర్హులైన సామాన్యులకు అందుతాయా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. యూనిట్లు తక్కువగా ఉండడం..దరఖాస్తులు భారీగా రావడంతో పాటు ఇప్పటికే గ్రామాల్లో సబ్సిడీ రుణాలపై రాజకీయ జోక్యం పెరిగిపోయింది. రుణాలపై ఇప్పటికే చాలా మంది ఆశావహులు ఆశలు వదులుకున్నారు. దరఖాస్తు చేసుకున్నా పరిశీలనకు చాలా మంది గైర్హాజరు అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. రుణాల కోసం ఓవైపు అధికార పార్టీలోనే పోటీ పెరిగిపోయింది. ఇలాంటి తరుణంలో సామాన్యులకు రాయితీ రుణాలు అందని ద్రాక్షలా మారాయి.

భారీగా వచ్చిన దరఖాస్తులు

ప్రభుత్వం మంజూరు చేసిన సబ్సిడీ యూనిట్లకు గ్రామాల నుంచి ఆశావహులు భారీగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నారు. తక్కువ యూనిట్లు విడుదల చేయడంతో పోటీ భారీగా పెరిగిపోయింది. బనగానపల్లె నియోజకవర్గంలోని ఐదు మండలాలకు 309 యూనిట్లు మంజూరు చేశారు. వీటిలో బీసీలకు ఎక్కువ యూనిట్లు కేటాయించారు. అతి తక్కువగా కాపు, ఈడబ్ల్యూఎస్ యూనిట్లు ఉన్నాయి. ఈ రుణాల కోసం ఐదు మండలాల నుంచి 4,675 మంది దరఖాస్తు చేసుకున్నారు. నామ మాత్రంగా యూనిట్లు మంజూరు చేయడంపై నిరుద్యోగ యువత మండిపడుతున్నారు. యూనిట్ విలువ రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఉంది. 50 శాతం సబ్సిడీ కావడంతో అధికార పార్టీ నాయకులను కాదని తమ వరకు రుణాలు రావడం అసాధ్యమని సామాన్యులు నిర్ణయించుకున్నారు. శుక్రవారం ఆయా మండలాల్లో దరఖాస్తుదారుల సర్టిఫికెట్ల పరిశీలన జరగనుంది.


యూనియన్ బ్యాంక్ అధికారులు లేకపోవడంతో వేచి ఉన్న అభ్యర్థులు

నియోజకవర్గంలో యూనిట్ల వివరాలు

మండలం	యూనిట్లు	దరఖాస్తులు
కొలిమిగుండ్ల	60	771
అవుకు	55	772
సంజామల	59	482
కోవెలకుంట్ల	55	742
బనగానపల్లె	80	1908

అర్హులకు మంజూరు చేయాలి

కాపు కార్పొరేషన్ కింద రూ.3 లక్షల యూనిట్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశాను. యూనిట్ మంజూరైతే ఎలక్ట్రికల్ దుకాణం నిర్వహించుకోవాలని అనుకుంటున్నా. సబ్సిడీ రుణాలు అర్హులకు మంజూరు చేస్తే చాలా ఉపయోగపడుతుంది. అధికారులు, బ్యాంకర్లు దరఖాస్తుల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి అర్హులకు న్యాయం చేయాలి.

–వరలక్ష్మి, అంకిరెడ్డిపల్లె

నిరుద్యోగులకు అవకాశం ఇవ్వాలి

కార్పొరేషన్ల రుణాల మంజూరులో పారదర్శకత పాటించాలి. చాలా మంది యువకులు ఉపాధి లేక ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రుణాలు మంజూరైతే ఉపాధి అవకాశాలు వస్తాయి. యూనిట్లు తక్కువగా ఉన్నాయి. దరఖాస్తులు మాత్రం ఎక్కువగా వచ్చాయి. ఎవరికి వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది.

–రామ్మోహన్, తుమ్మలపెంట

రాజకీయ జోక్యం ఉండరాదు

రుణాల మంజూరు విషయంలో రాజకీయ జోక్యం ఉండరాదు. సాధారణ, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వాళ్లు ఎంతో ఆశతో రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అధికారులు ఎవరి ప్రమేయం లేకుండా పూర్తి స్థాయిలో పరిశీలించి అర్హులకు ప్రాధాన్యత కల్పించాలి. యూనిట్లు అనర్హులకు దక్కకుండా పారదర్శకత పాటించేలా చూడాలి.

–దావీదు, సీపీఎం నాయకుడు, కొలిమిగుండ్ల

పదుల్లో యూనిట్లు.. వందల్లో దరఖాస్తులు

బనగానపల్లె రూరల్: బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు గురువారం బనగానపల్లె మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలానికి కేవలం 80 యూనిట్లు మాత్రమే మంజూరు చేయగా 1908 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఎంపీడీఓ వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిన ఇంటర్వ్యూలకు సుమారు 1200 మంది తరలిరావడంతో కార్యాలయం కిక్కిరిసిపోయింది. మొదటి రోజు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు, కెనరా బ్యాంకు, యూనియన్, ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, యూనియన్ బ్యాంకు అధికారులు వచ్చారు. పేరుకు ఇంటర్వ్యూలు అని చెప్పినా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను తీసుకుని పంపించేశారు. రాజకీయ నాయకుల జోక్యంతోనే మొక్కుబడిగా ఇంటర్వ్యూలను మమ అనిపిస్తున్నారని నిరుద్యోగులు చర్చించుకోవడం కనిపించింది. రుణాలు రాజకీయ పలుకుబడి ఉన్నవారికే వస్తాయని, అర్హత కలిగిన పేదలకు న్యాయం జరగదన్న అభిప్రాయాన్ని కొందరు వ్యక్తం చేశారు. కాగా యూనియన్ బ్యాంకు అధికారులు ఉదయం అలా వచ్చి ఆ తర్వాత కనిపించకుండా పోయారు. ఎంతకూ రాకపోవడంతో నిరుద్యోగులు గంటల తరబడి వేచిచూసి అసహనం వ్యక్తం చేశారు. బనగానపల్లె, టంగుటూరు, నందవరం, పలుకూరు గ్రామాలకు చెందిన అభ్యర్థులు దరఖాస్తులను ఆయా బ్యాంకు అధికారులకు అందజేశారు. మిగిలిన గ్రామాల అభ్యర్థులకు శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు.

అందరి సహకారంతోనే ఆస్పత్రి అభివృద్ధి


మాట్లాడుతున్న ఎంపీపీ రాజశేఖర్‌రెడ్డి

డోన్ రూరల్: మండలంలోని చిన్నమాల్కాపురం ప్రాథమి ప్రభుత్వాస్పత్రి అభివృద్ధికి అందరూ సహకరించాలని ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం పీహెచ్‌సీలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై పలు సలహాలు, సూచనలు చేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ వెంకటేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రాజ్‌కుమార్‌యాదవ్, సర్పంచ్ లక్ష్మి ప్రసన్న, వైద్యుడు చెన్నకేశవులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి


ప్రమాదంలో దెబ్బతిన్న లారీలు

డోన్ టౌన్: లారీ అదుపు తప్పి మరో లారీని ఢీకొనడంతో డ్రైవర్ మృతిచెందిన ఘటన గురువారం రాత్రి డోన్ పట్టణ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. తమిళనాడు రిజిస్ట్రేషన్ కలిగిన లారీ హైదరాబాద్ వైపు నుంచి బెంగళూరు వైపు వెళుతోంది. డోన్ పరిధిలోని జాతీయ రహదారిలో ఉన్న మంజీరా బార్ అండ్ రెస్టారెంట్ వద్దకు రాగానే టైరు పేలింది. దీంతో వాహనం అదుపుతప్పి డివైడర్ ఎక్కి అవతలి వైపు బెంగళూరు నుంచి హైదరాబాద్ వెళుతున్న (గడివేములకు చెందిన లారీ)లారీని బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో తమిళనాడు రాష్ట్రానికి చెందిన లారీ డ్రైవర్(సుమారు 40 ఏళ్లు) క్యాబిన్‌లో ఇరుక్కొని అక్కడికక్కడే మృతి చెందాడు. లారీలో ఒక్కడే ఉండడంతో వివరాలు తెలియరాలేదు. మరో లారీలోని డ్రైవరు, క్లీనర్లు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. విషయం తెలుసుకున్న సీఐ ఇంతియాజ్‌బాషా, ఎస్‌ఐలు శరత్‌కుమార్‌రెడ్డి, నరేంద్రకుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్రేన్ సహాయంతో లారీలను పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. మృతుదేహాన్ని ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. విచారణ చేస్తున్నారు.

నియామకాలు చేపట్టాలని నిరసన

డోన్ టౌన్: ఎల్ఐసీలో ఉద్యోగ నియామకాలు చేపట్టడంతో పాటు మెజార్టీ సభ్యులున్న ఏఐఐఈఏ సంఘానికి గుర్తింపు ఇవ్వాలని డోన్ ఉద్యోగ సంఘం అధ్యక్ష కార్యదర్శులు రహంతుల్లా, దేవన్న డిమాండ్ చేశారు. గురువారం గంటసేపు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఉద్యోగులు బీనారావు, వీరన్న, హరిప్రసాద్, కిరణ్‌కుమార్, శేషయ్య, కళ్యాణ్‌కుమార్, అక్బర్, ఏజెంట్ల సంఘం నాయకులు శ్రీరాములు, ప్రసాద్ పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఉద్యోగుల వాకౌట్

బనగానపల్లె రూరల్: ఎల్ఐసీలో నియామకాలు చేపట్టాలని, మెజార్టీ సంఘానికి గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ దేశ వ్యాప్తంగా చేపట్టిన నిరసనలో భాగంగా స్థానిక ఎల్ఐసీ ఉద్యోగులు విధులకు గంట పాటు వాకౌట్ చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు వేణుగోపాల్, కార్యదర్శి ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.. కొంత కాలంగా ఎల్ఐసీలో క్లాస్ 3,4 ఉద్యోగ నియామకాలు చేపట్టకపోవడంతో ఉన్న వారిపై పనిఒత్తిడి ఎక్కువైందని తెలిపారు. నాయకులు ఎస్ఎండీ ఖాసీం, జయశంకర్ పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

కోవెలకుంట్ల: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో పేకాట ఆడుతున్న వ్యక్తులను గురువారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఏడుగురు వ్యక్తులు ముళ్లపొదల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి పట్టుకున్నామని వెల్లడించారు. వారి వద్ద నుంచి పేకముక్కలు, రూ. 29 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

మాలల యుద్ధ గర్జనకు కదలిరండి

అవుకు/సంజామల: ఈ నెల 23న కర్నూలు ఎస్టీబీసీ కాలేజీ గ్రౌండ్‌లో జరగనున్న రాయలసీమ మాలల యుద్ధ గర్జన సభను విజయవంతం చేయాలని మాల మహానాడు ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షుడు సింగిరిగారి ఓబయ్య కోరారు. గురువారం అవుకు, సంజామల మండలాల్లో కరపత్రాలను పంపిణీ చేశారు.

పుస్తకావిష్కరణ

డోన్: అట్టడుగు వర్గాల హక్కులను కాపాడేందుకు దివంగత మానవ హక్కుల ఉద్యమ నేత బాలగోపాల్ ఎంతగానో శ్రమించారని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి రాగుల రాముడు అన్నారు. ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా సామాజిక కార్యకర్త మహమ్మద్ రఫి ఆధ్వర్యంలో సామాజిక ఉద్యమ చరిత్ర అనే పుస్తకాన్ని గురువారం డోన్‌లో ఆవిష్కరించారు.

బేతంచెర్ల-కర్నూలు బస్సుల దారి మళ్లింపు

బేతంచెర్ల: ఎన్‌హెచ్ 340బీ రోడ్డు పనుల కారణంగా బేతంచెర్ల నుంచి కర్నూలు వెళ్లే ఆర్టీసీ బస్సులను సిమెంట్ నగర్, తమ్మరాజు పల్లె మీదుగా దారి మళ్లించినట్లు బనగానపల్లె ఆర్టీసీ డిపో మేనేజర్ రవి కిశోర్ తెలిపారు. ఈ మార్గంలో 10 కిలోమీటర్లు అదనంగా ఉండడంతో అదనపు చార్జీ వసూలు చేస్తామని.. ప్రయాణికులు గమనించాలని పేర్కొన్నారు.

వేతనాలు చెల్లించాలని నిరసన


గోదాము ఎదుట ఆందోళన చేస్తున్న హమాలీలు

కోవెలకుంట్ల: స్థానిక సివిల్ సప్లైస్ గోదాములో పని చేస్తున్న హమాలీల వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సుధాకర్, హమాలీ యూనియన్ గౌరవాధ్యక్షుడు ఆంజనేయులు డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో గోదాము ఎదుట ఆందోళన చేపట్టారు. 13 నెలల నుంచి హమాలీల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. పెండింగ్ వేతనాలను త్వరితగతిన చెల్లించడంతోపాటు ప్రస్తుత ధరలకు అనుగుణంగా కూలీ రేట్లను పెంచాలని కోరారు. హమాలీలు రామసుబ్బయ్య, నరసింహుడు, పాములేటి, ఉసేని పాల్గొన్నారు.

సారా జోలికి వెళితే కఠిన చర్యలు

డోన్ రూరల్: నాటు సారా తయారు చేసినా.. విక్రయించినా కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి అన్నారు. గురువారం తన కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. డోన్ ఎక్సైజ్ పరిధిలోని ప్యాపిలి, డోన్, బేతంచెర్ల మండలాల్లో సారాను నిర్మూలించడమే లక్ష్యంగా దాడులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎక్కడైనా సారా విక్రయిస్తే 9440902584 నంబర్‌కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వివాహిత మృతి

కొలిమిగుండ్ల: ఆత్మహత్యకు యత్నించిన వివాహిత ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతి చెందినట్లు సీఐ రమేష్ బాబు తెలిపారు. ఆయన వివరాల మేరకు.. గొర్విమానుపల్లెకు చెందిన సునీత(20)ను భర్త మొలక శ్రీనాథ్, మామ శ్రీనివాసులు అనుమానంతో కొద్ది రోజుల నుంచి వేధిస్తుండేవారు. వారి వేధింపులు తాళలేక ఈనెల 4వ తేదీ ఇంట్లో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందింది. మృతురాలి తల్లి సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త, మామలపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీ


విరిగిపోయిన విద్యుత్ స్తంభం

ప్యాపిలి: మండల పరిధిలోని జలదుర్గం గ్రామంలో గురువారం లారీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. విద్యుత్ స్తంభం పూర్తిగా విరిగి పోవడంతో విద్యుత్ సరఫరా ఆగిపోయింది. దీంతో మధ్యాహ్నం నుంచి గ్రామం అంధకారంలోనే ఉంది. విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన లారీ గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడిదే అని సమాచారం. ప్రమాదం జరిగి గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయినా లారీ యజమాని స్పందించకపోవడంతో విద్యుత్ పునరుద్ధరణలో జాప్యం ఏర్పడినట్లు తెలుస్తోంది. ట్రాన్స్‌కో సిబ్బంది విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపడుతున్నారు.

నేటి నుంచి 'కార్పొరేషన్'లకు ఇంటర్వ్యూలు


బ్యాంకు మేనేజర్లతో చర్చిస్తున్న ఎంపీడీఓ

ప్యాపిలి: బీసీ, కాపు, ఈబీసీ కార్పొరేషన్‌లలో రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు శుక్ర, శని వారాల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు ప్రారంభం అవుతాయన్నారు. గురువారం పోతుదొడ్డి, ప్యాపిలి, నల్లబల్లి, కలచట్ల, మెట్టుపల్లి, వెంగళాంపల్లి, గుడిపాడు, పెద్దపొ దిళ్ల, ఎస్. రంగాపురం గ్రామాల అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. శనివారం బూరుగల, మాధవరం, మునిమడుగు, నేరేడుచెర్ల, ఎన్ రాచర్ల, కొమ్మెమర్రి, జక్కసానికుంట్ల, జలదుర్గం, చంద్రపల్లె గ్రామాల అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఇంటర్వ్యూలకు వచ్చే అభ్యర్థులు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం, కుల,ఆదాయ ధృవీకరణ ఒరిజినల్,జిరాక్స్ పత్రాలతో హాజరు కావాలన్నారు.

బ్యాంకు మేనేజర్లతో సమీక్ష

బేతంచెర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్పొరేషన్ రుణాల మంజూరుకు సంబంధించి బ్యాంకు మేనేజర్లతో ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ గురువారం సమీక్షించారు. మండలంలో బీసీ, ఈబీసీ, కాపు రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు శుక్రవారం ఉదయం 10 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అవుకు: మండల పరిధిలో కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి ఆయా బ్యాంకు మేనేజర్ల సమక్షంలో శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంగన్న తెలిపారు. అవుకు మండలంలో బీసీ, ఈబీసీ, కాపు కార్పొరేషన్ రుణాలకు 772 మంది దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు.

సంజామల: బీసీ, ఈబీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సాల్మన్ తెలిపారు. అభ్యర్థులు ఉయదం 10 గంటలకు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు.

గాయపడిన కార్యకర్తలకు పరామర్శ


వైఎస్సార్‌సీపీ కార్యకర్తను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

డోన్: పత్తికొండ నియోజకవర్గం క్రిష్ణగిరి మండలం రామక్రిష్ణాపురం గ్రామంలో ఇటీవల టీడీపీ నాయకుల దాడిలో గాయపడ్డ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి గురువారం డోన్ ప్రభుత్వాస్పత్రిలో పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు కావస్తున్నా ఎలాంటి ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడం లేదని విమర్శించారు. అభివృద్ధి పథకాలను చేపట్టకుండా కేవలం కక్ష్యసాధింపు చర్యలకు పాల్పడుతూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని.. ప్రజల పరిస్థితి దయనీయంగా మరిందన్నారు. ఆమె వెంట క్రిష్ణగిరి మాజీ ఎంపీపీ కంగాటి వెంకట్రామిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్రాముడు, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ కటారుకొండ మాధవ రావు తదితరులు ఉన్నారు.

ప్రాథమిక స్థాయిలోనే భాషా నైపుణ్యాలు నేర్పించాలి


మాట్లాడుతున్న ఎంఈఓ

ప్యాపిలి: మూడు నుంచి ఆరేళ్లలోపు చిన్నారులకు ప్రాథమిక స్థాయిలోనే కృత్యాధార పద్ధతిలో భాష నైపుణ్యాలను నేర్పించాలని ఎంఈఓ వెంకటేశ్ నాయక్ అన్నారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్ఎం సరళ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లకు జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈఓ, హెచ్ఎం మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న చిన్నారులకు ఒకటో తరగతిలో చేరేనాటికి గణిత సామర్థ్యాలు, భాష సామర్థ్యాలు నేర్పించాలన్నారు. పిల్లలు శారీరక అభివృద్ధితో పాటు సామాజిక భావోద్వేగ అభివృద్ధి, భాషాభివృద్ధి సాధించేలా అంగన్‌వాడీ టీచర్లు కృషి చేయాలన్నారు. డీఆర్పీలు చిన్నపరెడ్డి, నరసింహారెడ్డి, మల్లేశ్, సూపర్‌వైజర్లు శకుంతల, దేవకృప తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ విభాగం బలోపేతానికి చర్యలు


మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిని సత్కరిస్తున్న వలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

డోన్: నంద్యాల జిల్లాలో వైఎస్సార్‌సీపీ వలంటీర్ విభాగాన్ని బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టు ప్రసాద్ తెలిపారు. గురువారం మాజీ ఎమ్మెల్యేలు కాటసాని రామిరెడ్డి, శిల్పారవిచంద్ర కిషోర్‌రెడ్డిలను కలిశారు. వలంటీర్ విభాగం బలోపేతానికి సహకరించాలని కోరారు. త్వరలో జిల్లా స్థాయి వలంటీర్ విభాగం సమావేశాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఇందులో పార్టీ పటిష్టతకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తామని తెలిపారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జాకీర్‌హుసేన్, మాజీ కౌన్సిలర్ మేకల రాజు ఉన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
డోన్, బనగానపల్లె
90100 55532 (డోన్)
99122 20581 (బనగానపల్లె)
Office mail : sakshiknladvt@gmail.com